## మల్లాది వెంకట కృష్ణమూర్తి

# పొరుగిల్లు



అయ్యవారు మంత్రిగా పదవీ స్వీకారం చేసిన వారంరోజుల్లోనే తన ఆరోగ్యం సరిగ్గా వుందో లేదో అందరిచేతా పరీక్ష చేయించుకున్నాడు. ఆయనకి చాలా కాలంగా హృద్రోగం వుంది. మెడికల్ రిపోర్ట్స్ అన్నీ చేసిన ఆర్థోపెడిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్, ఎంత త్వరగా ఆయన ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ చేయించుకుంటే అంత మంచిదని సలహానిచ్చాడు.

"రాష్ట్ర ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో అలాంటి ఆపరేషన్స్ చేసే వైద్య సౌకర్యాలున్నాయి. చేయడానికి అనుభవం, సమర్థత గల డాక్టర్స్ కూడా వున్నారు" చెప్పారాయన.

అయ్యవారు తన కుటుంబ సభ్యులతో, పార్టీకార్యకర్తలతో, తోటి మంత్రులతో, ఆప్తులయిన ఎం.ఎల్.ఏలతో సంప్రతించి తన ఆపరేషన్ ఇండియాలో కాక అమెరికాలో జరగాలని నిర్ణయించుకున్నాడు.

రాజు తలచుకుంటే దెబ్బలకి కొదవాన్నట్లుగా అయ్యవారి అమెరికా ప్రయాణానికి ఏర్పాట్లు చక చక జరిగిపోసాగాయి. ఆయన వెంట ఆయన సతీమణి, పెద్ద కొడుకు, పర్సనల్ సెక్రటరీ, ఫేమిలీ డాక్టర్ మొదలయిన వారంతా వెళ్ళాలని అయ్యవారు నిర్ణయించారు.

హూస్టన్‌లోని హాస్పిటల్‌లో ఆయన ఆపరేషన్ మే పదకొండో తారీకు జరుగుతుంది. ఆ మేరకు హాస్పిటల్‌లో స్పెషల్ సూట్, ఆయన వెంట వెళ్ళే వారికి హోటల్స్‌లో గదులుకూడా కేటాయించబడ్డాయి.

ఎప్పటిలానే ప్రతిపక్షాలు ఆయన అమెరికా ప్రయాణం మీద గొడవ లేవదీశాయి. ఇండియాలో, అందులో రాజధానిలోనే అలాంటి ఆపరేషన్ చేయించుకునే సౌకర్యాలుండగా, వాటిని వద్దని ముఖ్యమంత్రి విదేశాలకి వెళ్ళి ఫారిన్ ఎక్స్ఛేంజ్‌ని ఖర్చు చేయడం అభ్యంతరకరమయిన విషయంగా పేర్కొన్నారు. ఎప్పటిలానే పత్రికలు కూడా ఆ విషయం గురించి వ్రాసాయి. ఎప్పటిలానే మంత్రిగారు ప్రతి పక్షాలను, పత్రికలనీ ఖాతరు చెయ్యలేదు. జ్యోతిష్కులు పెట్టిన ముహూర్తానికి మంత్రి హైదరాబాద్‌లోని తన స్వగృహంలోంచి ఎయిర్ పోర్ట్‌కి బయలుదేరారు, ఆయన బొంబేకి వెళ్ళడానికి ఎక్కాల్సిన విమానం రావడానికి గంటన్నర టైంవున్నా.

పత్రికా విలేకరులు, ఎం.ఎల్.ఏలు, తోటి మంత్రులు, రాజకీయ నాయకులు, అభిమానులు, స్నేహితులు, డబ్బులు తీసుకొనిరాబడ్డవాళ్ళు, వందమంది ఆయనకి వీడ్కోలు ఇచ్చారు. ఆరోగ్యంతో తిరిగి రావడానికి శుభాకాంక్షలు తెలియచేసారు.

ఇరవై రెండు గంటల తర్వాత అయ్యవారు అమెరికాలోని హూస్టన్ నగరానికి చేరుకున్నారు. అయ్యవారు వి.ఐ.పి. పేషెంట్. ముందురోజు ఆయన హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఇండియాలోని ఫైవ్‌స్టార్ హోటల్ కన్నా అనేక రెట్లు అధిక సౌకర్యాలను ఆ హాస్పిటల్‌లో చూసి ఆశ్చర్యపోయారు.

అయ్యవారికి ఆపరేషన్ చేసే డాక్టర్స్ టీమ్ లీడర్ ఆడమ్‌స్మిత్ ఆయనకి ఆపరేషన్ ఎందుకు, ఎలా చేస్తారో ఛార్ట్స్ చూపించి వివరించారు. ఆపరేషన్ ఎంతసేపు పడుతుంది, బాధవుంటుందా, ఎనస్థీషియా ఎంతసేపు పనిచేస్తుంది మొదలయిన అంశాలగురించి అయ్యవారు అడిగి తెలుసుకున్నాడు.

"డాక్టర్ చౌదరి అనే ఆయన కూడా మీకు ఆపరేషన్ చేసే ప్యానల్‌లోవున్నారట సర్" చెప్పాడు అయ్యవారి ఫేమిలీ డాక్టర్ ఆదుర్దాగా.

"చౌదరా! మన దేశస్థుడా?" అడిగాడాయన.

"ఆంధ్రుడండి!" చెప్పింది అయ్యవారి భార్య.

"ఇంతదూరం వచ్చింది మనవాళ్ళచేత ఆపరేషన్ చేయించుకోడానికి కాదు. స్మిత్‌తో మాట్లాడతాను."

అయ్యవారు డాక్టర్ ఆడమ్‌స్మిత్‌ని పిలిపించాడు వెంటనే. నలుగురు డాక్టర్స్ కలిసి ఆ ఆపరేషన్ చేస్తారని, ఆ నలుగురిలో ముగ్గురు అమెరికన్స్, ఒకరు ఇండియన్ అని ఒప్పుకున్నాడు స్మిత్.

"చూడండి. డాక్టర్ చౌదరిలు, శాస్త్రిలు, రెడ్డిలు మావూళ్ళలో చాలామంది వున్నారు. నేనిన్నివేల మైళ్ళు ఇంత శ్రమపడి రావడానికి కారణం మీ దేశస్థులు చేసే ఆపరేషన్ చేయించుకోవాలని. దయచేసి ఆ చౌదరి స్థానంలో డాక్టర్ జేమ్స్‌నో, జాన్‌నో వేయండి."

"నో.నో. డాక్టర్ చౌదరి ఇక్కడున్న మంచి డాక్టర్లలో ఒకరు."

"సార్. నాకది అంగీకారం కాదు."

"డాక్టర్ జేమ్స్ అదే సమయంలో వేరే ఆపరేషన్ చేస్తారు. డాక్టర్ జాన్ సెలవులో వున్నాడు."

"నాకదేం తెలీదు. పోనీ మీ ప్రెసిడెంట్ చేత చెప్పించనా?" అడిగాడు అయ్యవారు.

"ఈ పాటిదానికోసం ఆయన టైం వృధాచేయటం దేనికి లెండి. మీ ఇష్ట ప్రకారమే అమెరికన్ డాక్టర్‌ని ఏర్పాటు చేస్తాను." చెప్పాడు డాక్టర్ స్మిత్ నిస్సహాయంగా.

"దటీజ్ గుడ్."

ఆపరేషన్ రెండున్నర గంటలపైనే పట్టింది. సక్సెస్ అయింది. అయ్యవారు త్వరలోనే కోలుకో సాగాడు.

ఆయన స్వదేశానికి వెళ్ళాక తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పి వాటిని తప్పక పాటించాలని హెచ్చరించాడు డాక్టర్ స్మిత్.

"రేపు ఉదయం నేను న్యూయార్క్ వెళ్ళి అక్కడనుంచి ఇండియా వెళ్ళిపోతున్నాను. ఇవాళ రాత్రి మీకు చిన్న విందు ఇంద్దామని మా ఆవిడ వుత్సాహపడుతోంది" చెప్పారు అయ్యవారు బయలుదేరబోయే ముందురోజు.

"థాంక్స్. కాని మీ ఆతిథ్యాన్ని స్వీకరించలేక పోతున్నందుకు సారీ. మా నాన్నగారు మీకన్నా ముసలివారు. ఇవాళ ఆయనకి త్రోట్ కేన్సర్‌కి ఆపరేషన్ జరగబోతోంది. రాలేను."

"ఎప్పుడు?" అడిగాడు అయ్యవారు.

"సాయంత్రం మూడున్నర నించి ఆరుదాకా."

అయ్యవారు రాత్రి ఏడున్నరకి డాక్టర్ స్మిత్ తండ్రిని పరామర్శించడానికి కేన్సర్ హాస్పిటల్‌కి వెళ్ళారు. ఆయనకి ఇంకా స్పృహలేదు.

"ఆపరేషన్ సక్సెస్ అయింది. ఇది నూటికి పది శాతమే విజయవంతం అయే ఆపరేషన్." సంతోషంగా చెప్పాడు డాక్టర్ స్మిత్.

తను స్వయంగా అభినందిస్తానంటే అయ్యవారికి డాక్టర్ స్మిత్ ఆపరేషన్ చేసిన ముగ్గురు డాక్టర్లని పరిచయం చేసారు.

"ఆయన డాక్టర్ చౌదరి, ఈయన డాక్టర్ శాస్త్రి ఈయన డాక్టర్ రెడ్డి, సామాన్యమయిన అమెరికన్స్‌కి వీళ్ళ ఫీజు అందుబాటులో వుండదు. ది బెస్ట్ బ్రెయిన్స్ ఇన్ ది మెడికల్ వరల్డ్ ఆఫ్ హూస్టన్" చెప్పాడు డాక్టర్ స్మిత్.

వాళ్ళలో ఒకరు చిరునవ్వు నవ్వి అడిగాడు అయ్యవారిని.

"ఇక్కడి డాక్టర్స్ కన్నా మనకి నైపుణ్యం లేకపోతే వాళ్ళు మనల్ని ఇక్కడ ఎందుకు వుండనిస్తారు?"